జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
కరీంనగర్
జగిత్యాల - రాజన్న సిరిసిల్ల - పెద్దపల్లి
బుధవారం | 23 | అక్టోబర్ | 2024 ◆ పేజీలు : 6

## కరీంనగర్ కమీషనరేట్లో ఓపెన్ హౌస్



2లో...



## జగిత్యాల జిల్లాలో కాంగ్రెస్ నాయకుడు ...

# దారుణ హత్య..

- ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ముఖ్య అనుచరుడుగా ఉన్న గంగారెడ్డి
- న్యాయం చేయాలంటూ రోడ్డుపై బైఠాయించిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి
- మీ పార్టీ కో దండం.. మీకో దండం
- పార్టీ నాయకులను కాపాడుకోని పార్టీ ఎందుకు?
- సొంత పార్టీ నాయకుల చేతే చంపిస్తున్నారు!
- ప్రజలకు సాయం చేయాలనుకుంటే ఎన్జీవో పెట్టుకొంటాం
- ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆగ్రహం

2 లో..



## ప్రాణాపాయ స్థితిలో ఉన్న పూజారికి అండగా మాజీ మంత్రి ఈటల రాజేందర్



గులియన్ బేరో సింద్రోమ్ వ్యాధి చికిత్స కి 20 లక్షలు అవసరం

వైద్యం ఖర్చు నేనే భరిస్తా.. మాజీ మంత్రి ఈటల రాజేందర్



2లో...

## గంజాయి రహిత సమాజాన్ని నిర్మిద్దాం...

సంపూర్ణ ఆరోగ్యంగా ఉందాం.
మత్తును వీడి సమాజ శ్రేయస్సుకు పాటుపడదాం.
ఆంటీ నార్కో బ్యూరో డి.ఎస్.పి ఉపేందర్



6 లో...



# కరీంనగర్ కమీషనరేట్లో ఓపెన్ హౌస్ కార్యక్రమం



**కరీంనగర్ క్రైం, అక్టోబర్ 22, ప్రజాజ్యోతి**

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా కరీంనగర్ కమీషనరేట్ పరేడ్ గ్రౌండ్ లో మంగళవారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కరీంనగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ లోని పలు పాఠశాలలు, కళాశాలలకు చెందిన సుమారు వెయ్యి మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు.విద్యార్థుల సందర్శనార్థం పోలీసుశాఖలోని వివిధ విభాగాల పనితీరును తెలిపే విధంగా పరేడ్ గ్రౌండ్ లో పలు స్టాల్ లను ఏర్పాటు చేశామన్నారు,వాటిల్లో పోలీసులు వాడే తుపాకుల ప్రదర్శన,పోలీసు జాగిలాల ప్రదర్శన,సైబర్ క్రైమ్,యాంటీ నార్కోటిక్ సెల్,షీ టీమ్, ట్రాఫిక్ పోలీసుల పనితీరు,అల్లరి మూకలను చెదరగొట్టుటకు వాడే స్మోక్ గన్ లు,వజ్ర వాహనాలను కమాండ్ కంట్రోల్ వాహనాల వాడకం.పై విద్యార్థులకు అవగాహన కల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (శాంతి భద్రతలు) ఎ. లక్ష్మీనారాయణ , అడిషనల్ డీసీపీ (ఏ ఆర్) అనోక్ జయ్ కుమార్ లతో పాటు ఏసీపీలు విజయ్ కుమార్ , మాధవి , నరేందర్ రిజర్వు ఇన్స్పెక్టర్లు రజినీకాంత్ , శ్రీధర్ రెడ్డి , కుమార స్వామి ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రాణాపాయ స్థితిలో ఉన్న పూజరికి అండగా మాజీ మంత్రి ఈటల

**గులియన్ బేరో సిండ్రోమ్ వ్యాధి చికిత్సకి 20 లక్షలు అవసరం**

**వైద్యం ఖర్చు నేనే భరిస్తా.. మాజీ మంత్రి ఈటల రాజేందర్**



**జమ్మికుంట, అక్టోబర్ 22, ప్రజాజ్యోతి**

జమ్మికుంట పట్టణానికి చెందిన తులసి రాజేందర్ – దుర్గ దంపతుల చిన్న కుమారుడైన తులసి రఘురామ్ శర్మ ఎడ్లపల్లె గ్రామంలోని శ్రీ అభాయాంజనేయస్వామి దేవాలయంలో ధూప దీప నైవేద్య అర్చకులుగా పనిచేస్తున్నారు.. గత 10రోజుల క్రితం రఘురామ్ శర్మ తీవ్ర అనారోగ్యానికి గురి కాగా హైదరాబాద్ లోని యశోదా హాస్పటల్ వైద్యులు జీ.బీ.ఎస్ .గులియన్ బేరో సింట్రోమ్ వ్యాదిగా గుర్తించారు.. ప్రాణాపాయ స్తితిలో ఉన్న అతని వైద్య చికిత్సకై 20లక్షలు అవసరం అవుతుందని, వృత్తి రీత్యా పూజలు చేసుకొని జీవనం సాగించే తమకు అంత ఖర్చు పెట్టుకునే స్తోమత లేదని దాతల ఆర్థిక సహాయం చేస్తే తమ కొడుకుని బ్రతికించుకుంటామని వార్త పత్రికల ద్వారా, సోషల్ మీడియా ద్వారా ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తుండగా మోత్కులగూడెం గ్రామానికి చెందిన ఈటల అభిమానులు,బిజెపి శ్రేణులు ఈ విషయాన్ని మాజీ మంత్రి మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ దృష్టి కి తీసుకెళ్లగా వారు వెంటనే స్పందించిన హాస్పిటల్ యాజమాన్యంతో మాట్లాడి తులసి రఘురాంశర్మ కి మెరుగైన వైద్యం అందించాలని వైద్యం ఖర్చు తానే భరిస్తానని మాజీ మంత్రి ఈటల రాజేందర్ ఫోన్ ద్వారా హాస్పటల్ యాజమాన్యంతో మాట్లాడి బాధితుడు తులసి రఘురాంశర్మకి అండగా నిలిచాడు.ఈ కార్యక్రమంలో తులసి రాజేందర్ శర్మ, బిజెపి నాయకులు ఊడుగుల మహేందర్, పొనగంటి రవికుమార్, ఆకుల పోచయ్య, రావుల మహిపాల్ పాల్గొన్నారు..

# జగిత్యాల జిల్లాలో కాంగ్రెస్ నాయకుడు ...

# దారుణ హత్య..

- ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ముఖ్య అనుచరుడుగా ఉన్న గంగారెడ్డి
- న్యాయం చేయాలంటూ రోడ్డుపై బైఠాయించిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి
- మీ పార్టీ కో దండం.. మీకో దండం
- పార్టీ నాయకులను కాపాడుకోని పార్టీ ఎందుకు?
- సొంత పార్టీ నాయకుల చేతే చంపిస్తున్నారు!
- ప్రజలకు సాయం చేయాలనుకుంటే ఎన్జీవో పెట్టుకొంటాం
- ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆగ్రహం



**జగిత్యాల , అక్టోబర్ 22, ప్రజాజ్యోతి**

జగిత్యాల జిల్లాలో కాంగ్రెస్ నాయకుడు దారుణ హత్యకు గురయ్యాడు. జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ మారు గంగారెడ్డిని(58) దుండగులు కిరాతకంగా హత్య చేశారు. ఉదయం గ్రామంలో బైక్ పై వెళుతున్న గంగారెడ్డిని మొదట కార్ తో వెనుక నుండి ఢీ కొట్టి కింద పడగానే కత్తులతో విచక్షణ రహితంగా దాడి చేశారు.కుటుంబ సభ్యులు గంగారెడ్డిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలోనే మృత్యువాత పడ్డాడు. అయితే ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి ముఖ్య అనుచరుడుగా ఉన్న గంగారెడ్డి హత్య జిల్లాలో కలకలం రేపింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి వెంటనే జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని గంగా రెడ్డి మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి హత్యకు పాల్పడిన నిందితుల్ని పట్టుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.కాంగ్రెస్ పార్టీలో కీలకంగా ఉన్న గంగారెడ్డిని మర్డర్ చేస్తే తనను కూడా హత్య చేసిన దాంతో సమానం అంటూ జీవన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ఈ హత్యకు భూ వివాదాలు కారణమా లేక రాజకీయ కక్ష్యలతో జరిగిందా అన్నది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది...



**- మీకు, మీ పార్టీకి ఓ దండం**

**- కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి**

తన అనుచరుడి హత్యపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి రోడ్డుపై ఆందోళనకు దిగారు. అక్కడికి వచ్చిన ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ తో మాట్లాడుతూ హాట్ కామెంట్స్ చేశారు. 'మీకు.. మీ పార్టీకి ఓ దండం... ఇంతకాలం మానసికంగా అవమానాలకు గురవుతున్నామేం భరించాం. మమ్మల్ని ఇలాగైనా బతకనివ్వండి. ప్రజలకు సాయం చేయాలనుకుంటే ఎన్జీవో పెట్టుకొంటాం' అని అన్నారు.కొంత కాలం క్రితం ఆయన పార్టీ మారతారని ప్రచారం జరగడం తెలిసిందే.ప్రభుత్వం సుస్థిరంగా ఉన్నప్పటికీ అవసరం లేకున్నా వలసలను ప్రోత్సహిస్తోందని మండిపడ్డారు.పార్టీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా 10 నియోజకవర్గాలలో ఎమ్మెల్యేలను చేర్చుకున్నారని ఘాటుగా స్పందించారు.



**- ఘటనపై జీవన్ రెడ్డితో టీపీసీసీ చీఫ్ ఆరా..**

మారు గంగారెడ్డి హత్యకు గల కారణాలపై టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ ఆరా తీశారు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి ఫోన్ చేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలోనే ఎమ్మెల్సీ ఒకింత ఉద్వేగానికి లోనయ్యారు. 'క్షమించండి ఇక నేను పార్టీలో కొనసాగలేను' అంటూ మధ్యలోనే కాల్ కట్ చేశారు. అంతకు ముందు విప్ లక్ష్మణ్ కుమార్తో 'నీకో దండం.. నీ పార్టీకోదండం.. ఇకపై ఏదైనా స్వచ్ఛంద సంస్థ పెట్టుకుని ప్రజలకు సేవ చేస్తాను, పార్టీలో అవమానాలను భరిస్తూ ఉండలేను' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, గంగారెడ్డి హత్యను జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్కుమార్ తీవ్రంగా ఖండించారు. ఈ" మేరకు ఆయన ఓ వీడియో రిలీజ్ చేశారు. హత్యా రాజకీయాలను ముమ్మాటికీ ప్రోత్సహించనని స్పష్టం చేశారు.

**- పోలీసుల అదుపులో నిందితుడు..?**

గంగారెడ్డిని జాబితాపూర్ గ్రామానికే చెందిన సంతోశ్ గౌడ్ అనే యువకుడు హత్య చేసినట్లుగా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికే పోలీసులు నిందితుడుని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లుగా విశ్వసనీయంగా తెలిసింది. భూ వివాదాలు, పాతకక్షల నేపథ్యంలోనే హత్య జరిగినట్లుగా గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

**- పలువురు నాయకుల నివాళులు**

ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రధాన అనుచరుడు, జాబితాపూర్ మాజీ ఎంపీటీసీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మారు గంగారెడ్డి మంగళవారం ఉదయం హత్యకు గురై మృతి చెందగా విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, మృతుడు గంగారెడ్డి పార్థివ దేహానికి నివాళులు అర్పించిన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం వారి అంతిమ యాత్ర దహన సంస్కారాల కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గంగారెడ్డి మృతి చాలా బాధాకరమని,వారి మృతి పార్టీకి తీరని లోటని,వారి హత్యను తీవ్రంగా ఖండిస్తున్నామని,హత్య వెనుక ఎవ్వరూ ఉన్న,ఎంత పెద్ద నాయకుడు ఉన్న విడిచి పెట్టే ప్రసక్తే లేదని,హత్య చేసిన నిందితుడిని ఇప్పటికే పోలీసుల అదుపులోకి తీసుకున్నారని,అతని పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఇప్పటికీ జిల్లా ఎస్పీ, పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించడం జరిగిందనీ ఈ సంధర్భంగా తెలిపారు.వారి వెంట జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# క్రీడలతో ఆత్మస్థైర్యం పెంపొందించుకోవచ్చు

## సింగరేణి ఆర్ జీవన్ జీఎం లలిత్ కుమార్



*గోదావరిఖని, అక్టోబర్ 22, ప్రజాజ్యోతి*

క్రీడల ద్వారా ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవచ్చునని సింగరేణి ఆర్జీవన్ జీఎం డి. లలిత్ కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక జవహర్ లాల్ నెహ్రూ స్టేడియం లో వర్క్ ఫీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో కంపెనీ స్థాయి కబడ్డీ,బాల్ బ్యాడ్మింటన్ 2024-25 వార్షిక క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఆర్జీ-1 జీఎం ముఖ్య అతిథిగా హాజరై క్రీడోత్సవ జెండాను ఎగురవేసి పోటీలను ప్రారంభించారు.ఈసందర్భంగా క్రీడాకారులనుద్దేశించి ఆయన మాట్లాడారు.సింగరేణి స్థాయి వార్షిక క్రీడా పోటిల్లో అన్ని ఏరియాల నుంచి వివిధ క్రీడాకారులు హాజరయ్యారని తెలిపారు. ఫైనల్ విజేతలు కోల్ ఇండియా స్థాయి పోటిలకు హాజరు కానున్నట్లు వెల్లడించారు.క్రీడాకారులు క్రీడా నైపుణ్యంతో ఆడితే విజయం సాధించవచ్చునన్నారు.ప్రతి ఒక్కరు క్రీడా స్పూర్తిని ప్రదర్శించాలని,ఓడిన వారు గెలిచిన వారిని స్పూర్తిగా తీసుకొని లోటుపాట్లను సవరించుకొని ముందుకు సాగాలని సూచించారు .ఈ కార్యక్రమంలో ఎఐటియుసి సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరి కె.స్వామీ,సియంఒఏఐ సింగరేణి అధికారుల సంఘం ప్రతినిధి, క్రాంతి, యస్.ఓ.టు జియం రామ్మోహన్,పర్సనల్ మేనేజర్ కిరణ్ బాబు,స్పోర్ట్స్ గౌరవ కార్యదర్శి బంగారు సారంగపాణి,ఎస్టేట్ ఆఫీసర్ కుమార స్వామీ,అధికారులు వసంత్ కుమార్, వీరారెడ్డి, స్పోర్ట్స్ సూపర్ వైజర్స్ రమేష్,జాన్ వేస్లీ,నరేందర్ రెడ్డి, అశోక్, పాషా, శ్రీనివాస్, కో ఆర్డినేటర్ సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

# ప్రభుత్వ నిర్లక్ష్యంతో ప్రశ్నార్థకమవుతున్న మత్స్యకారుల ఆర్థిక ఎదుగుదల

**జులై నెలలో చేయవలసిన ఉచిత చేప పిల్లల పంపిణీ అక్టోబర్ వచ్చిన దిక్కులేదు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షుడు కొలిపాక సమ్మయ్య ముదిరాజ్**



*హుజురాబాద్, అక్టోబర్ 22, ప్రజాజ్యోతి*

కెసిఆర్ నాయకత్వం లోని గత బిఆర్ఎస్ ప్రభుత్వం మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన ఉచిత చేప పిల్లల పంపిణీ పథకం ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో నీరుగారుతోన్న సంకేతాలు కనిపిస్తున్నాయని. జూలై నెలలో కావలసిన ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమం అక్టోబర్ నెల వచ్చిన కానరావడం లేదని. రాష్టంలో అక్కడక్కడ పంపిణీ చేసిన.. అవి నాసిరకం చేప పిల్లలని. మత్స్యకారులు నిరాకరించి తిరిగి పంపడం జరుగుతుందని ముదిరాజ్ మహాసభ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు కొలిపాక సమ్మయ్య ముదిరాజ్ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం హుజురాబాద్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో దాదాపు 2965 చేరువులు వుండగా.. 610 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉన్నాయని. గత సంవత్సరం బిఆర్ఎస్ ప్రభుత్వం ఈ చెరువుల్లో 6.38కోట్ల రూపాయల విలువైన 6.32కోట్ల నాణ్యమైన చేపపిల్లలను పంపిణీ చేసిందన్నారు. తెలంగాణ వ్యాప్తంగా ప్రతి జిల్లాలో గరిష్టంగా 5 వేల టన్నుల చేపల ఉత్పత్తి జరిగి మత్స్యకారులు ఆర్థికంగా లాభ పడ్డారని సమ్మయ్య గుర్తు చేశారు. ఇప్పుడున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సమయానికి చేప పిల్లల పంపిణీ చేయకుండా జాప్యం చేస్తుందని మండిపడ్డారు. మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధిని విచ్చిన్నం చేస్తోందని సమ్మయ్య విమర్శించారు. దశాబ్దాలుగా మత్స్యకారులు ఆర్థికంగా, రాజకీయంగా విద్యా..ఉద్యోగపరంగా వెనుకబడి ఉన్నారన్నారు. రాష్ట్రముఖ్యమంత్రి మత్స్యకారులను చిన్న చూపు చూడకుండా.. చొరవ తీసుకుని తెలంగాణ వ్యాప్తంగా ఉన్న చెరువుల్లో నాణ్యమైన ఉచిత చేప పిల్లల పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కెసిఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రంలో తొమ్మిదెండ్లు మత్స్యకారులు నిండు చెరువుల్లో అమోఘమైన మత్స్య సంపదను చూశారన్నారు. ఇప్పుడున్న ప్రభుత్వం కూడా నాటి ప్రభుత్వంలా మత్స్యకారుల అభివృద్ధికి చర్యలు చేపడితే తప్ప... మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధి సాధ్యం కాదని చెప్పారు.

# రక్త దానం నిండు జీవితాన్ని నిలబెట్టే సంజీవని...



*చిగురుమామిడి, అక్టోబర్ 22, ప్రజాజ్యోతి*

ఈ భూమిపై ఒక నిండు జీవితాన్ని నిలుపగలిగే ఒక మానవతా హృదయ సహాయం రక్త దానం అని పలువురు యువకులు ఆదర్శంగా నిలుస్తున్నారు.ప్రణీధి ఫౌండేషన్ నవాబుపేట వారి ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామానికి చెందిన కొందరు యువకులు సామాజిక సేవతోనే మనం జీవిస్తున్న ఈ సమాజానికి మనవంతు కొంత సహాయం అందించగలం అని ప్రణధి ఫౌండేషన్ ను స్థాపించి గ్రామంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.మంగళవారం ప్రణధి ఫౌండేషన్ మెంబర్ బోయిని ఉమేష్ జన్మదినం సందర్భంగా కరీంనగర్ లోని ఓ ఆసుపత్రిలో ఓ పేషెంట్ కి ఆపరేషన్ నిమిత్తం అత్యవసరంగా రక్తం అవసరం ఉందని తెలియగా స్పందించిన ఉమేష్ అక్కడికి చేరుకుని రక్తదానం చేశాడు.ఈ పరిణామం తనకు సంతోశాన్ని కలిగిస్తుందని ఆనందం వ్యక్తం చేశాడు.ఈ సందర్భంగా ప్రణధి ఫౌండేషన్ మెంబర్స్ పిల్లి తిరుపతి,కుమ్మము నవీన్,బోయిని సంపత్,వంశీకృష్ణ అక్కడికి చేరుకుని ఉమేష్‌ను అభినందించారు.

# బి.సి. ఆజాద్ యూత్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ గా చిలకమరి శ్రీనివాస్



*హుజురాబాద్, అక్టోబర్ 22, ప్రజాజ్యోతి*

బిసి ఆజాద్ యూత్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ గా హుజురాబాద్ మండలం కాట్రపల్లి గ్రామానికి చెందిన చిలకమరి శ్రీనివాస్ ను నియమిస్తూ జాతీయ అధ్యక్షులు జక్కని సంజయ్ కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. హుజురాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన బీసీ ముఖ్య నాయకుల సమావేశంలో గతకొన్నిసంవత్సరాలుగా పద్మశాలిల ఐక్యత కోసం పనిచేస్తున్న, అదే విధంగా ప్రాథమిక చికిత్స నిపుణుడుగా పని చేస్తున్న శ్రీనివాస్ భవిషత్ లో బీసీ ఉద్యమ నిర్మాణానికి కృషి చేయాలని. ఈ నియమకం చేపట్టినట్లు సంజయ్ కుమార్ తెలిపారు. గ్రామ గ్రామాన బీసీలను సంఘటితం చేస్తూ పోరాటం చేయాలని ఆయన కోరారు. కాగా శ్రీనివాస్ నియామకం పట్ల పలువురు మిత్రులు, పద్మశాలి సేవా సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు. తన పై ఎంతో నమ్మకంతో ఈ భాధ్యతలు ఇచ్చిన సంజయ్ కుమార్ కు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలియజేశారు.

# రోడ్డు ప్రమాదంలో జూనియర్ లైన్ మెన్ మృతి





*హుజురాబాద్, అక్టోబర్ 22, ప్రజాజ్యోతి*

కరీంనగర్ జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. హుజరాబాద్ మండల పరిధిలోని తుమ్మనపల్లి గ్రామంలో జూనియర్ లైన్మెన్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇల్లందకుంట మండలం మల్యాల గ్రామానికి చెందిన మ్యాదరి సాయి రమణ (30) ఆముదాలపల్లిలో జూనియర్ లైన్మెన్ గా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి 8 గంటల తర్వాత విధులు నిర్వహించి. తిరిగి స్వగ్రామమైన మల్యాలకు వెళ్తుండగా.. బ్రేక్ డౌన్ అయింది. మార్గమధ్యలో తుమ్మనపల్లి గ్రామం కాకతీయ కాలువ సమీపంలో స్పీడ్ బ్రేకర్ల వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడడంతో సాయిరమణ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో ఘటన స్థలికి చేరుకొని పోలీసులు మృత దేహాన్ని స్వాధీనం చేసుకుని. పోస్టుమార్టం నిమిత్తం హుజురాబాద్ ఏరియా హాస్పిటల్ మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# నేటి నుంచి సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు




*జమ్మికుంట, అక్టోబర్22, ప్రజాజ్యోతి*

జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ యార్డులో నేటి నుంచి బుధవారం ఉదయం 10గంటల నుండి భారతీయ పత్తి సంస్థ వరంగల్ శాఖ ఆధ్వర్యంలో సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి మల్లేశం తెలిపారు..రైతులు పండించిన పత్తి ని సీసీఐ వారికి అమ్ముకునే రైతులు ఆధార్ కార్డు జిరాక్స్, పట్టాదార్ పాస్ బుక్ జిరాక్స్,ఆధార్ తో అనుసంధానం చేసుకున్న బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్ తప్పనిసరిగా వెంట తీసుకొని రాగలరు.పత్తిని ఆరపెట్టుకొని తేమ శాతం 8% నుండి 12% వరకు వుండే విధంగా పత్తి ని తీసుకొని వచ్చి సీసీఐ వారికి అమ్ముకోవాలని తెలిపారు..సీసీఐ మద్దతు ధర 7,521 నుండి 7,220 వరకు ఉంటుందని తెలిపారు..రైతు సోదరులు దళారులను నమ్మి మోసపోకుండా మార్కెట్ కు వచ్చి మద్దతు ధరకు అమ్ముకోవాలని తెలిపారు..

# సత్యం గౌడ్ కవిత సంకలనాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్



హుజురాబాద్, అక్టోబర్ 22, ప్రజాజ్యోతి

హుజురాబాద్ పట్టణానికి చెందిన ప్రజా కవి, రచయిత, సామాజికవేత్త, మానవ విలువల పరిరక్షణ జాతీయ అధ్యక్షులు, తత్వవేత్త, ఆధ్యాత్మిక గురువు బ్రహ్మశ్రీ నాగుల సత్యం గౌడ్ పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవ వారోత్సవాల సందర్భంగా రూపొందించిన కవితా సంకలనం.. పోలీసు అమరవీరులు పోషించిన పాత్ర,తరతరాలకు తరగని చరిత్ర... అనే కవిత సంకల్నాన్ని కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తన కార్యాలయ ఆవరణలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యం గౌడ్ మాట్లాడుతూ, పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివని, ఇందుకు ప్రతి ఒక్కరూ చట్ట పరిధిలో మెదిలి ప్రశాంతమైన జీవితాన్ని గడపాలన్నారు. పోలీసులు సమాజానికి రక్షణ కవచం లాంటివారని అందుకే ఫ్రెండ్లీ పోలీస్ నిర్వహించి, ప్రజలతో మమేకమయి, ప్రజల రక్షణ కొరకు అహర్నిశలు శ్రమిస్తు, శాంతి భద్రతలు కాపాడుతున్న పోలీసుల పాత్ర సమాజంలో అతి కీలకమైంది అన్నారు. శాంతి భద్రతల విషయంలో పోలీసులకు ప్రజలు సహకరిస్తూ నిజాయితీగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ సేవా బావాన్ని అలవర్చుకొని సమాజ సేవలో భాగస్వాములై, నవభారత నిర్మాణానికి పునాదిగా నిలవాలని సత్యం గౌడ్ పిలుపునిచ్చారు. మనం ఏర్పరచుకున్న విలువలు కాపాడుకుంటూ విలువైన పౌరులుగా ఎదిగినప్పుడే మానవ జన్మ సార్థకం అవుతుందన్నారు . ప్రతి ఒక్కరూ అంటరాని స్వార్థాన్ని వదులుకున్నప్పుడే మహాత్ములు, మహనీయులు ఔతారన్నారు. అనంతరం ఆవిష్కరించిన పోలీస్ అమరవీరుల కవిత సారాన్ని, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి సత్యం గౌడ్ ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో వోద్నల రాములు, మార్క్ అనిల్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## బోనమెత్తిన ఆడపడుచులు



జగిత్యాల, అక్టోబర్ 22, ప్రజాజ్యోతి

జగిత్యాల జిల్లా మోరపల్లి గ్రామంలో మంగళవారం అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఉపవాసముండి డప్పు సప్పుల్ల నడుమ బోనాలు నెత్తిన పెట్టుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొల్లె సత్తమ్మ, గంగారం అంబేద్కర్ సంఘ నాయకులు మహిళలు పాల్గొన్నారు.

## రక్త దానం చేసిన యువకుడు

జగిత్యాల, అక్టోబర్ 22, ప్రజాజ్యోతి



మేట్ పల్లి పట్టణంలోని సాయిసంజీవిని ప్రైవేట్ వైద్యశాల నందు చికిత్స పొందుతున్న ఎర్దట్ల గ్రామనికి చెందిన మహిళ ఇబ్రహీంపట్నం నర్సుకు అత్యవసరంగా రక్తం అవసరం కావడంతో ఫ్రెండ్స్ ద్వారా విషయం తెలుసుకున్న ఇబ్రహీంపట్నం మండలం డబ్బ గ్రామానికి చెందిన ఎక్కటి మహావీర్ అనే యువకుడు రక్తం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా రక్తదానం చేసిన మహావీర్ ని పలువురు అభినందించారు రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయలేము ప్రతి ఒక్కరు జీవితంలో ఒక్కసారైనా రక్తదానం చేసి ప్రాణదాతలుగ నిలవాలి.

## రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తిని సాధించాలి

### కోల్ కంట్రోల్ ఆర్గనైజర్స్ ఓ.యస్.డి సుబ్రహ్మణ్యం



గోదావరిఖని, అక్టోబర్ 22, ప్రజాజ్యోతి

సింగరేణిలో రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తిని సాధించాలని కోల్ కంట్రోల్ ఆర్గనైజర్స్ ఓ ఎస్డి అన్నారు. మంగళవారం కోల్ కంట్రోల్ ఆర్గనైజర్స్ ఓ.యస్.డి, సిసిఓ సుబ్రమణ్యం, కొత్తగూడెం కార్పోరేట్ సతీష్ గబియ్ ఓ.యస్.డి,సిసి ఓ నాగపూర్ ఆర్జీవన్ జిడికే 1అండ్3 ఇంక్లైన్ ను సందర్శించారు.ఈ సందర్బంగా సుబ్రమణ్యం,కొత్తగూడెం కార్పోరేట్ సతీష్ గబియ్ జిడికే 1అండ్3 ఇంక్లైన్ భూగర్బ గనిలోని పని స్థలాలు సందర్శించారు.బొగ్గు వెలికతీత,ఉద్యోగుల భద్రత కోసం చేపట్టిన రక్షణ చర్యల పై అడిగి తెలుసుకున్నారు.రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి చేయాలని సూచించారు.ఈ సందర్భంగా ఓ.యస్.డి,సిసిఓ సుబ్రమణ్యం సతీష్ గబియ్ స్థానిక జియం కార్యాలయం లో జియండి.లలిత్ కుమార్ తో పాటు ఇతర అధికారులు శాలువాతో సన్మానించారు.పూల బొకే అందజేశారు.ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ డివి రావు,యస్.ఓ.టు జియం రామ్మోహన్, ఏజంట్ రమేష్,ఎన్విరానైంట్ అధికారి అంజనేయ ప్రసాద్,మేనేజర్ రమేష్ కొత్తగూడెం కార్పోరేట్ అధికారులు శంకర్,రామరాజు, పర్సనల్ కిరణ్ బాబు, కర్ణ పాల్గొన్నారు.

## రైతులకు ఆయిలపామ్ సాగు పైన అవగాహన



వీణవంక, అక్టోబర్ 22, ప్రజాజ్యోతి

వీణవంక మండలంలోనీ రైతులకు ఆయిలపామ్ సాగు పైన అవగాహన సదస్సును నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా హార్టికల్చర్ అధికారి కమలాకర్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు ఆయిలపామ్ పంట సాగు విధానం,రైతులకు కలిగే లాభాలు గురించి వివరించారు.ఆయిల్ ఫామ్ సాగుతూ ప్రభుత్వం నుండి సబ్సిడీతో పాటు అధిక లాభాలు వస్తాయని ఆయన అన్నారు.రైతులు ఆయిల్ పామ్ సాగు చేసే వారికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గేల ధరను పెంచడం జరిగిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో లోహియా కంపెనీ సీఈవో సిద్ధాంత్,లోహియ కంపెనీ మేనేజర్ కి.భరత్,హార్టికల్చర్ అధికారి మంజువని,ఏవో గణేష్, ఏఈఓ లు సంగీత,గౌతమి రైతులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబానికి ఆర్థిక సాయం



వీణవంక, అక్టోబర్ 22, ప్రజాజ్యోతి

వీణవంక మండల కేంద్రానికి చెందిన గొట్టే భాగ్య ఇటీవల కాలంలో అనారోగ్యంతో మృతిచెందగా వారి చిత్రపటానికి నివాళులర్పించి,వారి కుటుంబ సభ్యులను పరామర్శించి,ప్రగాఢ సానుభూతి తెలియజేసి 5,000/-ఆర్థిక సహాయంగా యుప్ టీవీ,టూరిటో సీఈఓ పాడి ఉదయ్ నందన్ రెడ్డి అందజేశారు.కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ దసారపు ప్రభాకర్,వెన్నంపల్లి నారాయణ,సమీండ్ల చిట్టి, వోరేమ్ సురేష్,భోగం శ్రీను,దసారపు లోకేష్,మధు,అశోక్,వంశీ,అశోక్,తోట్ల రాకేష్,తాళ్ల పెల్లి కుమారస్వామి,ధనరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్జీ-3 నుండి డెలిగేట్స్ ట్రైనింగ్ కి కోట రవీందర్ రెడ్డి

రామగిరి, అక్టోబర్ 22, ప్రజాజ్యోతి



హైదరాబాద్ లోని ఇఎస్సిఐ లో జరిగనున్న డెలిగేట్స్ ట్రైనింగ్ కీ ఆర్జీ-3 ఏరియా నుండి ఐఎన్టీయూసీ ఉపాధ్యక్షుడు కోట రవీందర్ రెడ్డి పాల్గొననున్నారు. సింగరేణి సంస్థలో సేఫ్టీ, అడ్మినిస్ట్రేషన్, వివిధ అంశాలకు సంబంధించి సింగరేణి యాజమాన్యం గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఇఎస్సిఐ)లో సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో సీక్రెట్ బ్యాలెట్ ద్వారా గెలిచినటువంటి యూనియన్ల ఏరియా ప్రతినిధులకు ట్రైనింగ్ ఏర్పాటు చేయనుంది. ఈ క్రమంలో ఐఎన్టియుసి సెక్రటరీ జనరల్, మినిమం వేజ్ బోర్డు కమిటీ చైర్మన్ బి.జానక్ ప్రసాద్ ఐఎన్టియుసి గెలిచిన ఆరు ఏరియాలో వైస్ ప్రెసిడెంట్లను, యూనియన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కాంపెల్లి సమ్మయ్యనీ, జనరల్ సెక్రటరీ త్యాగరాజనీ పంపుతున్నారని తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీలో నాకు సముచిత స్థానం కల్పించండి

### మంత్రికి రామగుండం కార్పోరేషన్ అధ్యక్షులు వినతి

గోదావరిఖని, అక్టోబర్ 22, ప్రజాజ్యోతి



మూడు దశాబ్దాలకు పైగా కాంగ్రెస్ పార్టీ కి సేవలు అందిస్తున్న తనకు పార్టీలో సముచిత స్థానం కల్పించాలని ఆ పార్టీ రామగుండం కార్పొరేషన్ అధ్యక్షులు బొంతల రాజేష్ విజ్ఞప్తి చేశారు.మంగళవారం హైదరాబాద్ లో మంత్రి శ్రీధర్ బాబు తో పాటు రామగుండం ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షులు రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ ను కలసి వినతిపత్రం అందజేశారు. 35 సంవత్సరాల నుండి పార్టీలో ఉంటూ పార్టీ కోసం ఎంతో కృషి చేస్తున్నానని, సేవా కార్యక్రమాలు చేస్తూ మూడుసార్లు కార్పొరేటర్ గా, రామగుండం నగరపాలక అధ్యక్షుడిగా కొనసాగుతున్న తనకు ప్రాధాన్యత ఇచ్చి సముచిత స్థానం కల్పించాలని వినతి పత్రంలో కోరారు.

# ఐకేపి సెంటర్లలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలి

## తేమ శాతం లేకుండా ఆరబెట్టిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

### జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్



**జగిత్యాల, అక్టోబర్ 22, ప్రజాజ్యోతి**

ఐకేపీ కేంద్రంలో ఏర్పాటు చేసిన వివరాలు పక్కాగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రోజున మేడిపల్లి మండలం కాచారం గ్రామం మరియు భీమారం మండలాల్లోని దేశాయిపేట్, గోవిందారు గ్రామంలో ఐకేపీ ఫ్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా త్రాగు నీటి వసతి కల్పించాలని సూచించారు. ఆధార్ పట్టా పాస్ బుక్ వంటి వివరాలను కేంద్రంలో పెట్టాలని సూచించారు. అనంతరం ఆరబోసిన ధాన్యం యొక్క తేమ శాతాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో సరిపడా ప్యాడి క్లీనింగ్ మెషిన్స్ అందుబాటులో ఉంచాలని, గన్ని బ్యాగులు, టార్పలిన్లను అందుబాటులో ఉంచుకోవాలని, వర్షాకాలం అయినందున వర్షం పడే అవకాశం ఉన్నందున ఐకేపీ సెంటర్లలో ధాన్యం తడవకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. రైతులు ఆరబెట్టిన వరి ధాన్యాన్ని క్లీనింగ్ చేసి కొనుగోలు చేయాలని తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను చెయ్యాలని అధికారులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ DRDA మధన్ మోహన్, DSO DM, ఎమ్మార్వో వసంత, ఎంపీడీవో, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మా ఊరికి బస్సు సౌకర్యం కల్పించండి మంత్రి శ్రీధర్ బాబుకు వినతి

### మైదా బండ గ్రామ ప్రజలు..



**ముత్తారం, అక్టోబర్ 22, ప్రజా జ్యోతి**

మండలంలోని మైదంబండ గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని, మంగళవారం మైదంబండ గ్రామస్తులు ఐటీ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ను కలిసి వినతి పత్రం అందజేశారు.గ్రామస్తులు ఇతర గ్రామాలకు వెళ్లాలన్న విద్యార్థులు స్కూళ్లకు కాలేజీలకు వెళ్లాలన్నా చాలా ఇబ్బందిగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే మా గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని,మంత్రి శ్రీధర్ బాబును కోరారు. స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు, గోదావరిఖని డిపో మేనేజర్ తో ఫోన్లో మాట్లాడి సమస్యను పరిష్కరించారు.ఈ కార్యక్రమంలో ముత్తారం మండల మాజీ యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బియ్యని శివకుమార్, మైదంబండ కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు బూడిది శ్రీనివాస్, రాజబాబు, మహేందర్, రాజేందర్, రాము, పాల్గొన్నారు..

# కాటన్ మిల్లుకు పోటెత్తిన తెల్ల బంగారం

### కిలోమీటర్ బారులు తీరిన వాహనాలు



**జమ్మికుంట, అక్టోబర్ 22, ప్రజాజ్యోతి**

జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కి రైతులు కొత్త పత్తి రెండు మూడు రోజులుగా భారీగా తీసుకుని వస్తున్నారు..వివిధ గ్రామాల నుండి రైతులు జమ్మికుంట మార్కెట్ కి పత్తిని తీసుకొని వస్తున్నప్పటికీ మరి కొంతమంది రైతులు డైరెక్ట్ గా వారి పత్తిని విక్రయించడానికి నేరుగా పత్తి మిల్లులకు వెళ్తున్నారు..మంగళవారం పట్టణంలోని మంజునాథ కాటన్ మిల్లు కు పత్తి వాహనాల ల్లో కిలోమీటర్ వరకు బారులు తీరి వాహనాల్లో పత్తి వచ్చింది...జమ్మికుంట పత్తి మార్కెట్ లో సిసిఐ కొనుగోలు కేంద్రం ప్రారంభం కానప్పటికీ రైతుల నుండి వ్యాపారులు డైరెక్ట్ గా కొనుగోలు చేయడంతో రైతులు తాము పండించిన పత్తి పంటను నేరుగా పత్తి మిల్లులకు తీసుకువచ్చారు.. బుధవారం నేడు ఉదయం 10గంటలకు జమ్మికుంట కాటన్ మార్కెట్ లో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వరంగల్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్నామని ఉన్నత శ్రేణి మార్కెట్ కార్యదర్శి మల్లేశం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం జమ్మికుంట పత్తి మార్కెట్లో పత్తి ధర క్వింటాలుకు 6800 ధర పలికింది. వాతావరణంలో వస్తున్న మార్పులకు రైతులు భయపడి పత్తిని వెంట వెంటనే అమ్ముతున్నట్లు తెలుపుతున్నారు.

# ఓబీ మట్టిని అమ్ముకుంటున్న సింగరేణి అధికారి

### –ఆరోపిస్తున్న మండల ట్రాక్టర్ అసోసియేషన్



**రామగిరి, అక్టోబర్ 22, ప్రజాజ్యోతి**

భూ నిర్వాసితుల ఇండ్ల నిర్మాణం కొరకు సింగరేణి ఆర్జీ–3 యజమాన్యం వెసులుబాటు కల్పించిన ఓబీ మట్టిని కాంట్రాక్టర్లతో కలిసి సింగరేణి అధికారి అమ్ముకుంటున్నాడని రామగిరి ట్రాక్టర్ అసోసియేషన్ సభ్యులు ఆరోపించారు. ఈ మేరకు రామగిరి ట్రాక్టర్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్జీ–3 ఏరియాలోని ఎన్విరాల్మెంట్ అధికారి నాగేశ్వర్ రావు, స్థానిక ఒకరిద్దరు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై భూ నిర్వాసితులకు సింగరేణి యజమాన్యం కేటాయిస్తున్న ఓబీ మట్టిని అమ్ముకొని అక్రమ దానార్జనకు తెరాలేపరన్నారు. అన్ని అనుమతులతో ఓబీ మట్టిని రవాణా చేస్తున్న మా పై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఆర్జీ–3 జీఎం సుధాకర్ రావు స్పందించి, సమగ్ర విచరణ జరిపి, ఇకనైనా భూనిర్వాసులకు కేటాయించిన ఓబి మట్టి అన్యాక్రాంతం కాకుండా చూడాలని వేడుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామగిరి ట్రాక్టర్ అసోసియేషన్ అధ్యక్షులు నాడం లింగయ్య, , జూలపల్లి సత్తన్న, జీకే యాదవ్, తీగల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# ఊడిగే విజయ రాజశేఖర్ ఆధ్వర్యంలో దివ్యంగులకు ఉచిత బస్ పాస్ ల పంపిణీ

### రాజశేఖర్ దంపతులను అభినందిస్తున్న గ్రామస్తులు..



**సైదాపూర్, అక్టోబర్ 22, ప్రజాజ్యోతి**

పేదలకు ఆపదలో అండగా నేనున్నానంటూ ముందుకు వస్తూ తనకు తోచిన సహాయం అందజేస్తూ సామాజిక సేవ కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఉడిగే రాజశేఖర్ దంపతులు ముందుకు వచ్చి వికలాంగులకు ఉచిత బస్సు పాస్ లను అందజేశారు.కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం దుద్దేనపల్లి గ్రామ పంచాయితీ కార్యాలయంలో సోమవారం ఉడిగే విజయ రాజశేఖర్ ఆధ్వర్యంలో ముఖ్యఅతిథిగా వచ్చిన హుజురాబాద్ డిఎమ్ చేతులమీదుగా దివ్యంగులకి ఉచిత బస్ పాస్ లు పంపిణీ చేశారు.ముఖ్యఅతిథిగా వచ్చిన హుజురాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ ను శాలువాతో సన్మానించారు.అనంతరం హుజూరాబాద్ డిపో మేనేజర్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ దివ్యంగులు ఆర్టీసీ ఉచిత బస్ పాస్లు వినియోగించుకోవాలన్నారు.ఆర్టీసి బస్సులో ప్రయాణం సురక్షితం అని,ఆర్టీసీ బస్సులో ప్రయాణించడం వల్ల తక్కువ ఖర్చుతో ప్రయాణం చేయవచ్చునని, ట్రాఫిక్ సమస్యను నియంత్రించడం,పర్యావరణం కాలుష్యం తగ్గుతుందని అన్నారు. ఉడిగే రాజశేఖర్ దంపతులు భవిష్యత్తులో మరెన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆర్టీసీ డిపో మేనేజర్ అభినందించారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయితీ కార్యదర్శి ఆర్ శ్రీనివాస్, మాజీ సర్పంచి తాటిపల్లి యుగంధర్ రెడ్డి,ఆదిరెడ్డి,ఆర్టీసీ సిబ్బంది బోల్ల హరీష్,జెట్టి కనకయ్య,అంజయ్య,శ్రీనివాస్, రవి,రాజయ్య,రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.

# సురక్షితమైన నీటిని సరఫరాకు చర్యలు తీసుకోండి

### –ఎంపీడీవో శైలజ రాణి



**రామగిరి, అక్టోబర్ 22, ప్రజాజ్యోతి**

గ్రామాలలో సురక్షిత నీటి సరఫరా పై నిర్లక్ష్యం అవసరమగు చర్యలు తీసుకోవాలని రామగిరి ఎంపీడీవో బద్రి.శైలజ రాణి అన్నారు. ఈ మేరకు మంగళవారం రామగిరి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సంబంధిత అధికారులు గ్రామ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో డయేరియా రాకుండ సురక్షితమైన త్రాగు నీటి సరఫరా జరగాలని, అందుకు తీసుకోవాల్సిన చర్యలపై పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు.మిషన్ భగీరథ ధ్వారా నీరు గ్రామ పంచాయతీ ప్రజల అవసరాలకు సరిపడా సప్లై కాని సందర్భాల్లో గ్రామ పంచాయతీ పరిధిలోని వాటర్ ట్యాంక్, బోర్ మోటార్స్, భావులు వంటి నీటి వనరులను వాడేటప్పుడు ఆర్డబ్ల్యూఎస్ ఏఈ పరిశీలించిన పిదప నే ఆ నీటిని సప్లై చేయాలని, ప్రతీ రోజు క్లోరినేషన్ చేసి, దాని రీడింగ్ ఆశ కార్యకర్తల ద్వారా చేయించాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ శృతి, ఎంపీవో ఉమేష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## గ్రామ ప్రజల సమ్మతితో ఉపాధి పనులపై ప్రణాళిక



**రామగిరి, అక్టోబర్ 22, ప్రజాజ్యోతి**

గ్రామ ప్రజల సమ్మతితో ఉపాధి పనులపై ప్రణాళికకై మంగళవారం మండలంలోనీ ఆదివారం పేటలో గ్రామ సభ నిర్వహించారు. 2025-26 సంవత్సరానికి గాను గ్రామంలో చేపట్టాల్సిన పనుల్లో ఉమ్మడిగా చేసే పనులు, వ్యక్తిగత పనుల గురించి వివరించడం గ్రామస్థుల సమ్మతితో చేసే పనులను గుర్తించడం జరిగింది. ఈ గ్రామసభలో ఎంపీఓ ఉమేష్, ఏపీఓ లక్ష్మణ్, టీఏ సుప్రియ, పంచాయతీ కార్యదర్శి వేణు గోపాల్, ఫీల్డ్ అసిస్టెంట్ రాజయ్య రైతులు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలి

## యువత పెద్ద ఎత్తున పాల్గొనాలన్న ఎస్సై బండి రాజేష్

**చిగురుమామిడి, అక్టోబర్ 22, ప్రజాజ్యోతి**




పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా కరీంనగర్ హెడ్ క్వార్టర్స్ లో ఈనెల 23న బుధవారం 11 గంటలకు నిర్వహించే రక్తదాన శిబిరంను విజయవంతం చేయాలని కరీంనగర్ జిల్లా చిగురుమామిడి ఎస్ఐ బండి రాజేష్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై బండి రాజేష్ మాట్లాడుతూ రక్తదాన కార్యక్రమంలో చిగురుమామిడి మండలంలోని యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని ఎస్సై కోరారు. రక్తదానం చేయడం ద్వారా రోగి ప్రాణాలనే కాపాడడంతో పాటు వారి కుటుంబాన్ని రక్షించే వారు అవుతామని, నిత్యం ఎంతోమంది రక్తం దొరకక తను చాలిస్తున్నారని ప్రతి ఒక్కరు ఏడాదిలో రెండు సార్లు రక్తదానం చేసి ప్రాణం పోద్దామని చెప్పారు. రక్తదానం చేసే యువతకు ఉదయం 9 గంటలకు చిగురుమామిడి పోలీస్ స్టేషన్ వద్ద ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించినట్లు ఎస్ఐ వివరించారు. రక్తదానం చేసిన యువతకు ప్రశంసపత్రాలను ఉన్నత అధికారులచే అందించడం జరుగుతుందన్నారు.

## కరీంనగర్ జిల్లా బిజెపి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్రోల్మెంట్ ఇంచార్జ్ గా నరెడ్ల ప్రవీణ్ రెడ్డి

**కరీంనగర్ బ్యూరో, ప్రజాజ్యోతి**



మార్చి 2025 లో జరగబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం కరీంనగర్ జిల్లా బిజెపి పట్టభద్రుల ఎన్రోల్మెంట్ ఇంచార్జ్ గా నరెడ్ల ప్రవీణ్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం రోజున బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి నియామకపు ప్రకటన చేశారు. హుజురాబాద్ మండలం చిన్నపాపయ్యపల్లి గ్రామానికి చెందిన నరెడ్ల ప్రవీణ్ రెడ్డి పది సంవత్సరాలు ఏబీవీపీ ఫుల్ టైమర్ గా, జాతీయ కార్యవర్గ సభ్యుడిగా తదనంతరం బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పని చేశారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో మంచిర్యాల అసెంబ్లీ ప్రభారీగా, పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ పశ్చిమ అసెంబ్లీ ప్రభారీగా పని చేశారు. ఈ సందర్భంగా నరెడ్ల ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ త్వరలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల కోసం పట్టభద్రుల ఎన్రోల్మెంట్ ఇన్చార్జిగా తనకు అవకాశం కల్పించిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్కు, బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి కి, బీజేపీ శ్రేణులు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల ల్లో పట్టభద్రుల ఎన్రోల్మెంట్ కోసం పూర్తి సమయం కేటాయించి పని చేస్తానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

# గంజాయి రహిత సమాజాన్ని నిర్మిద్దాం...





### సంపూర్ణ ఆరోగ్యంగా ఉందాం. మత్తును వీడి సమాజ శ్రేయస్సుకు పాటుపడదాం.

### ఆంటీ నార్కో బ్యూరో డి.ఎస్.పి ఉపేందర్

**సుల్తానాబాద్, అక్టోబర్ 22, ప్రజా జ్యోతి**

గంజాయి రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థిని విద్యార్థుల భాగస్వామ్యం ఎంతైనా అవసరమని మత్తును వీడి సమాజ శ్రేయస్సుకు పాటుపడాలని ఆంటీ నార్కో డిఎస్పి ఉపేందర్ సూచించారు. మంగళవారం స్థానిక శ్రీవాణి డిగ్రీ కళాశాలలో గంజాయి మత్తు పదార్థాల నియంత్రణపై విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాదు నుండి ఆంటీ నాకు బ్యూరో డిఎస్పి ఉపేందర్ సిఐ కృష్ణమూర్తి హాజరై విద్యార్థిని విద్యార్థులకు పలు సూచన చేశారు. ఎస్సై శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో డిఎస్పి ఉపేందర్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన తెలంగాణ ప్రభుత్వ సీఎం రేవంత్ రెడ్డి గంజాయిని మత్తు పదార్థాలకు బానిసైన యువకులకు విద్యార్థిని విద్యార్థులకు విముక్తి కలిగించేందుకు రాష్ట్రస్థాయిలో అన్ని డిగ్రీ పీజీ ఇంటర్ కళాశాలలతో పాటు యువతను చైతన్యం చేసే అత్యంత ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని తీసుకోవడంతో ఈరోజు శ్రీవాణి డిగ్రీ కళాశాలలో విద్యార్థిని విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని స్పష్టం చేశారు. గంజాయి మత్తు పదార్థాలకు అలవాటు పడి యువత విద్యార్థిని విద్యార్థులు తమ అమూల్యమైన జీవితాలను నాశనం చేసుకుంటూ తమ ఆరోగ్యాలు నాశనం చేసుకుంటున్నారని గంజాయి మత్తు పదార్థాలను సమూలంగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యమై తమకు ఈ నెంబర్కు 8712671111, టోల్ ఫ్రీ నెంబర్ 14446 కు సమాచారం ఇస్తే గోప్యంగా ఉంచి తగు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా గంజాయి మత్తు పదార్థాలకు అలవాటు పడి యువత విద్యార్థిని విద్యార్థులు చదువుకునే సమయంలో దుర్భర జీవితాలను గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి కి అలవాటు పడిన వ్యక్తి అలవాట్లు అప్పుడే పసిగట్టవచ్చని ఒంటరిగా ఉండడం ఏకాంతంగా గడపడానికి ప్రయత్నం చేయడం తాగిన మత్తులో నేరాలు చేస్తూ కాలక్షేపం చేయడం వంటి లక్షణాలు ఉంటాయని అంతేకాకుండా బైక్ రైడింగ్ లు ఒకేసారి కోపానికి రావడంకూడా చేస్తూ ఉంటారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల యువత విద్యార్థిని విద్యార్థుల కంటే ఎక్కువగా సిటీ లలో గంజాయి మత్తు పదార్థాల ప్రభావం యువత విద్యార్థిని విద్యార్థులపై పడి తమ భవిష్యత్తును సర్వనాశనం చేసుకుంటున్నారని అలాంటి గంజాయి మత్తు పదార్థాలను నియంత్రించేందుకు రాష్ట్రవ్యాప్తంగా చైతన్యం చేసి గంజాయిని మత్తుపదార్థాలను పూర్తిగా నిర్మూలన చేస్తామని అన్నారు. గంజాయి మత్తుపదార్థాలు సేవించే యువత విద్యార్థిని విద్యార్థులపై పోలీసుల డేగ కన్ను ఉంటుందని ఎవరికైనా సమాచారం చేసిన ఎడల వెంటనే మాకు తెలిపితే విలువైన జీవితాలను కాపాడిన వారం అవుతామని సూచించారు. గంజాయి విక్రయించిన తయారుచేసిన చట్టరీత్య కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్పి ఉపేందర్ హెచ్చరించారు. ఈ సందర్భంగా సిఐ కృష్ణమూర్తి డాక్టర్ సింధుజ ఎస్ఐ శ్రావణ్ కుమార్ కళాశాల డైరెక్టర్ రేకులపల్లి సుష్మ ప్రిన్సిపాల్ బండారి కమలాకర్ బాలసాని శ్రీనివాస్ తదితరులు విద్యార్థిని విద్యార్థులకు గంజాయి మత్తుపదార్థులపై అవగాహన కల్పించారు. అనంతరం గంజాయి మత్తు పదార్థాల నియంత్రణ విద్యార్థిని విద్యార్థులతో ప్రతిజ్ఞ అనంతరం పోస్టర్ ఆవిష్కరించారు.

## ఎమ్మార్పీఎస్ ధర్మ యుద్ధ సభను విజయవంతం చేయాలిఎస్సీ వర్గీకరణ తక్షణమే అమలు చేయాలి

**వెల్గటూర్, అక్టోబర్ 22, ప్రజాజ్యోతి**



ఈ నెల 27న జగిత్యాల జిల్లా లో జరిగే ధర్మ యుద్ధ మహా సభ ను విజయవంతం చేయాలని, ఎస్సీ వర్గీకరణను తెలంగాణ రాష్ట్రంలో తక్షణమే ఉద్యోగ విద్య అవకాశాల్లో అమలు చేయాలని, లేదంటే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలను ఉదృతం చేస్తామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు సురుగు శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి మోకనపల్లి సతీష్, ఉమ్మడి వెల్గటూర్ మండల అధ్యక్షులు చేన్న కుమారస్వామిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం వెల్గటూర్ మండలంలోని కిషన్రావుపేట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ఆవరణలో ఉమ్మడి వెల్గటూర్ మండలం ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు చెన్న కుమారస్వామి ఆధ్వర్యంలో ఈనెల 27న జగిత్యాల జిల్లాలో జరిగే ఎమ్మార్పీఎస్ ధర్మయుద్ధ సభను విజయవంతం చేయడానికి సన్నాక సభను ఏర్పాటు చేశారు. ఈ సభలో వారు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ జగిత్యాల జిల్లాలో నిర్వహించే ధర్మ యుద్ధ మహాసభకు ముఖ్యఅతిధిగా హాజరవుతారని ఈ సభను విజయవంతం చేయడానికి వెల్గటూర్ ఉమ్మడి మండల వ్యాప్తంగా ఎమ్మార్పీఎస్ నాయకులు కార్యకర్తలు మేధావులు నిరుద్యోగులు అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. ఎస్సీ వర్గీకరణను తెలంగాణ రాష్ట్రంలో మొదటగా అమలు చేస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి హామీని విస్మరించాలని ఇప్పటికే పలు రాష్ట్రాలలో సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా వర్గీకరణను అమలు చేస్తున్నారని తక్షణమే తెలంగాణ రాష్ట్రంలో కూడా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అద్యక్షులు సురుగు శ్రీనివాస్, ఎంఎస్పీ వైస్ ప్రెసిడెంట్ కిషన్, దుమాల గంగారాం, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకనపల్లి సతీష్, ధర్మపురి నీయోజక వర్గ అధ్యక్షులు చిర్ర సతీష్, జిల్లా సీనియర్ నాయకులు గజ్జెల రాజేష్, మంతెన లక్ష్మణ్, బచ్చల స్వామి, బోయిని సతీష్, ఎల్లన్న, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.